సాక్షి కామారెడ్డి

గురువారం । 23 । ఫిబ్రవరి । 2023



హామీలను తుంగలో తొక్కారు

జిల్లాలోని పలు ప్రాంతాలలో బుధవారం బీజేపీ శక్తి కేంద్రాల స్ట్రీట్ కార్నర్ మీటింగ్స్ నిర్వహించారు.

- 9లో ▸



ఆచరణలో విఫలం

పాలకుల నిర్లక్ష్యంతో మంకీ ఫుడ్ కోర్టులు నిరుపయోగంగా మారాయి. నాటిన మొక్కలన్నీ ఎండిపోయాయి.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
37.0 /13.3

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

5,693 మందికి కంటి పరీక్షలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో కంటి వెలుగులో భాగంగా బుధవారం 5,693 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 607 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 1,27,583 మందికి కంటి పరీక్షలు చేసి, 20,517 మందికి కంటి అద్దాలను అందించామని వైద్యాధికారులు తెలిపారు.

ఈటల రాజేందర్ రాక

లింగంపేట: బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ గురువారం మోతె గ్రామానికి రానున్నారు. గ్రామంలో నిర్వహించే ప్రజాగోస – బీజేపీ భరోసా కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు దత్తురాం ఓ ప్రకటనలో తెలిపారు.

ఎత్తిపోతల పథకం పనుల పరిశీలన



నిజాంసాగర్: మంజీరా నదిపై నిర్మిస్తున్న నాగమడుగు ఎత్తిపోతల పథకం పనులను బుధవారం తహసీల్దార్ నారాయణ పరిశీలించారు. ముంపునకు గురయ్యే భూములు, పైపులైన్ ఏర్పాటు తదితర వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట సర్వేయర్ శ్రీకాంత్, ఏఈ రాజ్‌కమాల్ ఉన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

లింగంపేట: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ శ్రీనివాస్ హెచ్చరించారు. బుధవారం రాత్రి బాణాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్సైలు శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


తెయూ పీజీ పరీక్షలు వాయిదా

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ఈనెల 24 నుంచి జరగాల్సిన పీజీ సెమిస్టర్ పరీక్షలను విద్యార్థుల వినతి మేరకు వాయిదా వేసినట్లు కంట్రోలర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంసీఏ, ఎంబీఏ మొదటి, మూడో సెమిస్టర్స్, ఐఎంబీఏ 7, 9 సెమిస్టర్స్ పరీక్షలను వాయిదా వేశామని, పరీక్షల షెడ్యూల్ తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు.

బియ్యం లారీ చోరీ

నిజామాబాద్ సిటీ: బియ్యం బస్తాల లోడ్‌తో ఉన్న లారీ చోరీ అయింది. ఈ ఘటన మంగళవారం రాత్రి నిజామాబాద్ రూరల్ మండలం ఖానాపూర్ శివారులో చోటు చేసుకుంది. రూరల్ ఠాణా ఎస్సై లింబాద్రి తెలిపిన వివరాలు.. నగరంలోని నాందేవ్‌వాడకు చెందిన కందికంటి సుదర్శన్‌గౌడ్ మంగళవారం లారీ (ఏపీ24వీ 7796)లో లక్ష్మీ నరసింహ స్వరూపిని రైస్‌మిల్లులో 580 బస్తాల బియ్యం లోడ్ చేసుకున్నాడు. వాటిని ఖానాపూర్ శివారులో గల సీడబ్ల్యూసీ గోదాంలో అన్‌లోడ్ చేసేందుకు వెళ్లాడు. అక్కడ లైన్ ఉండటంతో లారీని అక్కడే పార్కు చేసి ఇంటికి వచ్చాడు. బుధవారం ఉదయం వెళ్లి చూడగా అక్కడ లారీ కనిపించలేదు. దీంతో ఆయన రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా లారీని పోలీసులు మహారాష్ట్ర సరిహద్దులోని సాలూర చెక్‌పోస్టు వద్ద స్వాధీనం చేసుకున్నారు. దొంగ లారీని చెక్‌పోస్టు వరకు తీసుకెళ్లి అక్కడే వదిలేసి పారిపోయాడు. నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ఆయకట్టుకు నీటి విడుదల




నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు అవసరాల మేరకు బుధవారం ప్రాజెక్టు నుంచి నాలుగో విడత నీటి విడుదల చేపట్టారు. ప్రాజెక్టునుంచి ప్రధాన కాలువకు 1,100 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ఆయకట్టు రైతులు నీటిని సద్వినియోగం చేసుకోవాలని నీటి పారుదల లశాఖ డిప్యూటీ ఈఈ శ్రావణ్‌కుమార్ సూచించారు.

ప్రశ్నాపత్రం.. ముద్రణ భారం!

DCEB KAMAREDDY
All the headmasters of all the managements are here by informed to conduct pre final 1 examination from 22.02.2023 to 28.02.2023 . The question papers for pre final 1 will be sent as a soft copy to the headmasters in the district before the day of each examination.
... nination study hours

డీఈవో నుంచి హెడ్ మాస్టర్లకు వచ్చిన మెస్సేజ్



జిల్లా విద్యాశాఖలో నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలకు సంబంధించి ప్రశ్నాపత్రాలను ముందుగానే డీసీఈబీ ముద్రించి ఆయా పాఠశాలలకు పంపించాల్సి ఉన్నా.. ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. ముద్రణ వద్దనుకున్నారో.. మరిచిపోయారోగాని చివరికి ప్రధానోపాధ్యాయుల వాట్సాప్‌కు సాఫ్ట్ కాపీని పంపి, జిరాక్స్ తీసుకోవాలని సూచించి చేతులు దులుపుకున్నారు.

- ప్రారంభమైన ఎస్సెస్సీ ప్రీ ఫైనల్స్
- నిర్లక్ష్యంగా వ్యవహరించిన విద్యాశాఖ
- జిరాక్స్ తీసుకోవాలంటూ హెచ్‌ఎంలకు ఆదేశం
- ఇబ్బందిపడుతున్న ఉపాధ్యాయులు

సాక్షి, కామారెడ్డి: జిల్లాలో 11,899 మంది విద్యార్థులు పదోతరగతి చదువుతున్నారు. బుధవారం నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలు మొదలయ్యాయి. షెడ్యూల్ ప్రకారం పరీక్షల నిర్వహణకు సిద్ధమైన విద్యాశాఖ అధికారులు.. ప్రశ్నాపత్రాల ముద్రణ విషయాన్ని మాత్రం పట్టించుకోలేదు. పరీక్షల తేదీలతో కూడిన మెస్సేజ్‌లో ప్రశ్నాపత్రాల సాఫ్ట్ కాపీని ఒకరోజు ముందుగా వాట్సాప్ ద్వారా పంపిస్తామని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా జిరాక్సు తీసుకోవాలని డీఈవో ఆదేశించడం గమనార్హం. అయితే ప్రశ్నాపత్రాల ముద్రణకు అయ్యే ఖర్చు ఉపాధ్యాయులే భరించుకోవాలని సూచించినట్లు తెలిసింది.

ప్రశ్నాపత్రాల కోసం గతేడాది సెప్టెంబర్‌లో విద్యార్థులనుంచి ఫీజులు వసూలు చేశారు. డబ్బులన్నీ డీసీఈబీ ఖాతాలో జమయ్యాయి. వాటితో ప్రశ్నాపత్రాలు ముద్రించి ఆయా పాఠశాలలకు పంపించాల్సిన విద్యాశాఖ.. డబ్బులు తీసుకుని, ముద్రణ సంగతిని విస్మరించింది. దీంతో ప్రశ్నాపత్రాల ప్రింట్ తీసుకోవడానికి ఉపాధ్యాయులు ఎక్కువ మొత్తంలో ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అదే విద్యాశాఖ అధికారులు బల్క్‌గా ప్రింట్ చేయిస్తే తక్కువ ఖర్చుతో ప్రశ్నాపత్రాలు తయారయ్యేవి. డబ్బులు డీసీఈబీలో జమ అయి నెలలు గడచినా, ప్రశ్నాపత్రాలను ముద్రించే విషయంలో నిర్లక్ష్యం చేయడంపై నిరసన వ్యక్తమవుతోంది. ఒకవేళ ప్రశ్నాపత్రాల రూపకల్పన ఆలస్యమే అయితే పరీక్షలను వాయిదా కూడా వేసుకునే వెసులుబాటు ఉంటుంది. కొన్ని జిల్లాల్లో వారం రోజుల పాటు వాయిదా వేసుకున్నారు. ఇక్కడి అధికారులు మాత్రం ప్రశ్నాపత్రాల ముద్రణ భారాన్ని పాఠశాలల హెచ్‌ఎంలపై మోపి చేతులు దులుపుకోవడం విమర్శలకు తావిస్తోంది. విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి జిల్లా విద్యాశాఖను గాడిన పెట్టాలని విద్యాభిమానులు కోరుతున్నారు.

వైద్య కళాశాల పనులు పూర్తిచేయండి

- డీఎంఈ రమేశ్‌రెడ్డి

కామారెడ్డి టౌన్: జిల్లాకు మంజూరైన వైద్య కళాశాల కోసం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో జరుగుతున్న పనులను 15 రోజుల్లో పూర్తి చేయాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కమిషనర్(డీఎంఈ) రమేశ్‌రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం ఆయన జిల్లా కేంద్ర ఆస్పత్రిని సందర్శించారు. జిల్లా కేంద్ర ఆస్పత్రి భవనంపైన జరుగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన డీసీహెచ్‌ఎస్ విజయలక్ష్మి, ఆర్‌ఎంవో శ్రీనివాస్‌లతో మాట్లాడారు. వైద్య కళాశాలకు సరిపడా 350 బెడ్లను సిద్ధం చేయాలని సూచించారు. నిజాంసాగర్ చౌరస్తాలో ఖాళీగా ఉన్న బహుళ అంతస్తుల ప్రైవేట్ భవనం చూశానన్న ఆయన.. దానికి సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. డీసీహెచ్‌ఎస్ చాంబర్‌లో వైద్యకళాశాల ఏర్పాటుపై సమీక్షించారు. ఎన్‌ఎంసీ వైద్య బృందం త్వరలో జిల్లాకు రానుందన్నారు. అప్పటిలోగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. వైద్య విద్యార్థులకు టీచింగ్ కోసం తరగతి గదులు, 350 బెడ్లతో జనరల్ ఆస్పత్రి, పరిపాలన కార్యాలయం ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం దేవునిపల్లిలో చేపట్టిన ఎంసీహెచ్, క్రిటికల్ కేర్ ఆస్పత్రి భవనాల నిర్మాణ పనులను పరిశీలించారు. ఇంజినీరింగ్ శాఖ అధికారి చంద్రశేఖర్‌తో మాట్లాడి పనులు తొందరగా పూర్తి చేయాలని సూచించారు.

ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు చేయాలి

జిల్లా కేంద్రంలోని 23వ వార్డులోగల ఎంపీపీఎస్ ఉర్దూ మీడియం స్కూల్‌లో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని డీఎంఈ రమేశ్‌రెడ్డి పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి కంటి



పనులను పరిశీలిస్తున్న డీఎంఈ రమేశ్‌రెడ్డి

పరీక్షలు చేయాలని డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్‌కు సూచించారు. నిర్లక్ష్యం చేసే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శిరీష, సూపర్‌వైజర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

సారూ.. వైద్యం అందించండి



డీఎంఈ రమేశ్‌రెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రిని పరిశీలిస్తుండగా ఓ రోగి బంధువు ఆయన వద్దకు వచ్చి రెండు చేతులెత్తి మొక్కింది. తన బంధువు గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్నా వైద్యులు పట్టించుకోవడం లేదని పేర్కొంది. తమకు వైద్య సేవలు అందేలా చూడాలంటూ కాళ్లు మొక్కేందుకు ప్రయత్నించగా డీఎంఈ అడ్డుకున్నారు. వైద్య సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. వైద్యులను పిలిచి వైద్యం అందించాలని సూచించారు.

ప్రశ్నించేవారిపై కేసులు పెడుతున్నారు

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

మద్నూర్: రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై అన్యాయంగా కేసులు పెడుతున్నారని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. బుధవారం ఆయన పెద్ద ఎక్లార, కొడిచిర, మద్నూర్ గ్రామాల్లో బహుజన రాజ్యాధికార యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మద్నూర్‌లో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో అధికార పార్టీ నాయకుల అణచివేత, వివక్ష చాలా తీవ్రంగా ఉందన్నారు. ఇసుక క్వారీ అక్రమాలను బయటపెట్టిన బిచ్కుంద మండలం ఖత్‌గాంలో ఎనిమిది మంది యువకులను 37 రోజుల పాటు జైళ్లలో పెట్టిన ఘన చరిత్ర ఇక్కడ పోలీసులకు, ఎమ్మెల్యేకు ఉందన్నారు. డబుల్‌బెడ్‌రూంలు అడిగితే కేసులు పెడుతున్నారన్నారు. ఈ ప్రాంతంలో సోయాబీన్ పంట ఎక్కువ పండుతున్నా ఇంతవరకు స్థానిక ఎమ్మెల్యే సోయా విత్తన కేంద్రాన్ని పట్టించుకోవడం లేదన్నారు. మూడు దశాబ్దాలు గడుస్తున్నా లెండి ప్రాజెక్ట్ పూర్తి కాలేదన్నారు. మండలంలోని పెద్ద ఎక్లార గేట్ వద్ద గల బాలికల గురుకుల పాఠశాలలో కనీసం టాయిలెట్లు లేకపోవడం బాధాకరమన్నారు. మద్నూర్ మండలానికి కేంద్రీయ విద్యాలయం మంజూరైనా ప్రారంభించ లేకపోతున్నారన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం లేదన్నారు. దళిత బంధు స్కీం దగా బంధు స్కీం అని విమర్శించారు. దళిత బంధులో మార్పులు చేసి పేదలందరికీ ప్రయోజనం చేకూర్చాలన్నారు. దళిత ఎమ్మెల్యే సాయన్న మరణిస్తే ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. కార్యాక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బాలరాజు, నాయకులు ప్రజ్ఞకుమార్, సురేశ్‌గౌడ్, రాములు, తుకారాం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

అభివృద్ధి పనుల వేగం పెంచండి

- వీసీలో గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా

కామారెడ్డి క్రైం: ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా కలెక్టర్‌లకు సూచించారు. బుధవారం ఆయన హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, అధికారులతో ఉపాధి హామీ పథకంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు సకాలంలో కూలి చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. పనుల పురోగతిపై ఫొటోలను అప్లోడ్ చేయాలని, అర్హులైన కూలీలకు మాత్రమే పనులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. మన ఊరు –మన బడి కార్యక్రమం కింద పాఠశాలలలో అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీసీలో శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డీఆర్‌డీవో సాయన్న, అదనపు డీఆర్‌డీవో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, అధికారులు

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరగాలి

కామారెడ్డి క్రైం: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా ఆరోగ్య, ఆశాకార్యకర్తలు కృషి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లో వైద్యులు, ఆరోగ్య ఆశాకార్యకర్తలతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాలు చేయించుకునే మహిళలకు కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రసవాలు చేయించుకుంటే గర్భిణుల కుటుంబ సభ్యులపై ఆర్థిక భారం పడుతుందన్నారు. గతేడాది ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రసవాలు చేయించుకుని 12 మంది గర్భిణులు మృతి చెందారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సౌకర్యాలు ఉన్నాయని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి, వైద్యులు, అధికారులు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

‘195 పశువులకు టీకాలు వేశాం’

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంతో పాటు పలు గ్రామాలలో బుధవారం పశువులకు లంపి స్కిన్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. లంపి స్కిన్‌తో పశువులు మృత్యుపడుతున్న పడుతున్న విషయమై ‘సాక్షి’ కథనాలను ప్రచురించింది. ఎట్టకేలకు పశు వైద్యాధికారులు స్పందించి టీకాల కార్యక్రమం చేపట్టారు. బుధవారం జిల్లా కేంద్రంలో సంచరిస్తున్న పశువులకు వైద్య సేవలు అందించారు. లంపి స్కిన్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. జిల్లాలో మొత్తం 195 పశువులకు టీకాలు ఇచ్చామని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు భాస్కర్ తెలిపారు. పశువుల యజమానులు స్పందించి టీకాలు వేయించాలని సూచించారు. నిజామాబాద్ సహాయ సంచాలకులు అశోక్ లంపి స్కిన్ వ్యాధి సోకిన పశువుల నుంచి శాంపిల్స్ సేకరించారు. వ్యాధిపై పశువుల యజమానులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది జుగల్ కిషోర్, లైవ్ స్టాక్ అసిస్టెంట్స్ నరేష్, జయరాజ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పశువులకు టీకా వేస్తున్న వైద్యాధికారి భాస్కర్

బస్టాండ్లను ఆధునికీకరిస్తాం

నిజాంసాగర్: ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్టాండ్లలో మరుగుదొడ్ల నిర్మాణం చేపడుతున్నామని ఆర్టీసీ ఆర్‌ఎం ఉషాదేవి తెలిపారు. బుధవారం నిజాంసాగర్‌లోని ఆర్టీసీ బస్టాండ్‌ను ఆమె పరిశీలించారు. ప్రయాణికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. నిజాంసాగర్ బస్టాండ్ ఆవరణలో రూ. 20 లక్షలతో సిమెంట్ రోడ్లు వేశామని తెలిపారు.



‘ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్లండి’



బాన్సువాడలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన వైద్యులు, సిబ్బంది

బాన్సువాడ టౌన్: బాన్సువాడలోని మాతాశిశు ఆస్పత్రికి జాతీయ స్థాయి గుర్తింపు లభించినందుకు గర్వంగా ఉందని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో వైద్యులు, సిబ్బంది ముందుకు వెళ్లాలని సూచించారు. బుధవారం ఎంసీహెచ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌ప్రసాద్ ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది స్పీకర్‌ను కలిసి, అవార్డుకు సంబంధించిన లోగోను స్పీకర్‌కు అందించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ శ్రీనివాస్‌ప్రసాద్ మాట్లాడుతూ స్పీకర్ కృషి వల్లే బాన్సువాడకు ఎంసీహెచ్ వచ్చిందన్నారు. ఆయన వ్యక్తిగత పర్యవేక్షణతో సత్ఫలితాలు వస్తున్నాయని, బాన్సువాడ ఎంసీహెచ్‌కు బ్రెస్ట్ ఫీడింగ్ ఫ్రెండ్లీ అక్రెడిటేషన్ లభించిందని పేర్కొన్నారు. వైద్య సేవలను మెరుగుపరచడానికి అవసరమైన సహాయ, సహకారాలను అందిస్తానని స్పీకర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యులు సుధ, సిబ్బంది పాల్గొన్నారు.

‘సాగర్’లో తగ్గుతున్న నీటిమట్టం

- ఆయకట్టుకు 5.5699 టీఎంసీల నీటి విడుదల
- క్యాచ్‌మెంట్ ఏరియాలో మోటార్లతో తోడుకుంటున్న రైతులు
- 1.5 టీఎంసీ వరకు నీరు మాయం

నిజాంసాగర్: ఆయకట్టు కింద సాగు చేస్తున్న యాసంగి పంటలకు నీటిని విడుదల చేస్తుండడంతో నిజాంసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా తగ్గుతోంది.

యాసంగి సీజన్‌లో నిజాంసాగర్ ఆయకట్టు కింద అలీసాగర్ రిజర్వాయర్ వరకు 1.2. లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. ప్రాజెక్టు నుంచి విడతలవారీగా నీటిని విడుదల చేస్తున్నారు. డిసెంబర్ 14 న నీటి విడుదలను ప్రారంభించారు. మొదటి విడతలో జనవరి 3 వరకు నీటిని అందించారు. వరినాట్లు పూర్తయ్యేంతవరకు నీరిచ్చారు. జనవరి 13 నుంచి 23 వరకు రెండో విడత, ఈనెల 2 నుంచి 13 వరకు మూడోవిడత నీటిని విడుదల చేశారు. మూడు విడతల్లో ఇప్పటివరకు 5.5699 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు అధికారులు చెబుతున్నారు.



నిజాంసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం

నీటి చౌర్యం?

వర్షాకాలంలో విస్తారంగా కురిసిన వర్షాలకు నిజాంసాగర్ ప్రాజెక్టు సుమారు నాలుగు నెలల పాటు నిండుకుండలా ఉంది. యాసంగి పంటల సాగు కోసం ప్రాజెక్టు నుంచి నీటి విడుదల చేపట్టిన సమయానికి ప్రాజెక్టులో 1,405 అడుగుల(17.8 టీఎంసీలు) నీరుంది. ఇప్పటివరకు మూడు విడతల్లో ఆయకట్టుకు 5.5699 టీఎంసీల నీరందించారు. దీని ప్రకారం 12 టీఎంసీపైన నీరుండాలి. కానీ సోమవారానికి ప్రాజెక్టులో 1,399.36 అడుగుల(10.686 టీఎంసీలు) నీరు మాత్రమే ఉంది. మరో 1.5 టీఎంసీ నీరు ఏమయ్యిందన్న విషయమై స్పష్టత లేదు. ఆవిరి రూపంలో కొంత, లీకేజీల రూపంలో ఇంకొంత నీరు ఖాళీఅవగా.. క్యాచ్‌మెంట్ ఏరియాలోని వ్యవసాయ పంపుసెట్ల ద్వారా మరికొంత నీరు ఖాళీ అయి ఉంటుందని భావిస్తున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు క్యాచ్‌మెంట్ ఏరియాలో కరెంట్ మోటార్లు, లిఫ్టులు భారీగానే ఉన్నాయి. దీంతో నీటి చౌర్యం జరుగుతోంది. పొరుగున ఉన్న సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని చుట్టుపక్కల గ్రామాల రైతులు ప్రాజెక్టు నీటిని ఎత్తిపోస్తూ పంటలు పండించుకుంటున్నారు. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం తగ్గిపోతోంది. ఆయకట్టు కింద సాగు చేస్తున్న పంటలు గట్టెక్కాలంటే మరో నాలుగు విడతలలో నీటిని విడుదల చేయాల్సి ఉంది. నీటి చౌర్యాన్ని అరికడితేనే ఆయకట్టు పంటలు పూర్తిస్థాయిలో గట్టెక్కే అవకాశాలున్నాయి.

‘నట్టల నివారణ మందు వేయించాలి’

లింగంపేట: జీవాలకు నట్టల నివారణ మందు వేయించుకోవాలని జిల్లా పశువైద్యాధికారి భరత్ సూచించారు. బుధవారం ఆయన లింగంపేటలో మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందు పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 7.40 లక్షల మేకలు, గొర్రెలు ఉన్నాయన్నారు. ఈనెల 22 నుంచి 28 వరకు నట్టల నివారణ మందు వేస్తామన్నారు. పశుపోషకులు పచ్చిగడ్డి పెంపకం చేపట్టాలని సూచించారు. సబ్సిడీపై పచ్చిగడ్డి కోత మిషన్(గ్రాస్ కట్టర్) అందిస్తామన్నారు. లింగంపేటలో 3,685 గొర్రెలు, 284 మేకలకు మందు వేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గరీబున్నీసాబేగం, వైస్‌ఎంపీపీ విఠల్‌రెడ్డి, సర్పంచ్ బొల్లు లావణ్య, ఫతియొద్దీన్, పశువైద్యాధికారులు రవికుమార్, దేవేందర్, సిబ్బంది రవి, రమేశ్, ఎజాస్ తదితరులు పాల్గొన్నారు.



నట్టల నివారణ మందు పంపిణీ చేస్తున్న జిల్లా పశువైద్యాధికారి భరత్

క్లుప్తంగా

ప్రాక్టికల్ పరీక్షకు 176 మంది గైర్హాజరు

నిజామాబాద్‌అర్బన్: ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు బుధవారం జిల్లావ్యాప్తంగా 176 మంది గైర్హాజరైనట్లు డీఐఈవో రఘురాజ్ తెలిపారు. ఆయన ఆరు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు రవికుమార్, చిన్నయ్య, కనకమహాలక్ష్మి, రాజీయుదిన్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

ఓపెన్ పరీక్ష ఫీజు గడువు పెంపు

నిజామాబాద్‌అర్బన్: ఓపెన్ ఇంటర్, పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించడానికి గడువు పొడిగించినట్లు డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23 నుంచి మార్చి 4 వరకు గడువు పెంచినట్లు తెలిపారు. తత్కాల్ కింద ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలన్నారు. వివరాలకు 8008403518 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌నాగారం: నెహ్రూ యువ కేంద్రంలో వలంటీర్ల నియామకం చేపట్టనున్నట్లు కేంద్రం కో ఆర్డినేటర్ బెల్లాల్ శైలి ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ ఒకటి నాటికి 18 నుంచి 29 ఏళ్లలోపు ఉండి, పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తు చేసే వారు ఎలాంటి రెగ్యులర్ విద్యాభ్యాసం చేయకూడదన్నారు. ఆసక్తి ఉన్న వారు మార్చి 9లోపు nyks. nic. in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ధ్రువ పత్రాల పరిశీలన, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారని వివరించారు. ఎంపికైన వారికి నెలకి రూ.ఐదు వేల గౌరవ వేతనం ఇస్తారన్నారు.

వృత్తి శిక్షణ కోసం..

నిజామాబాద్‌అర్బన్: మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వృత్తి శిక్షణ, ఉపాధి కల్పన కోసం ఇచ్చే శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. పీజీడీసీఏ, టైలరింగ్, ఎంబ్రాయిడరి, మెహంది డిజైన్, ప్రీ ప్రైమరీ టీచర్ విభాగంలో 3 నెలల పాటు శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తి ఉన్న వారు ఆధార్‌కార్డు, ఫుడ్‌సెక్యూరిటీ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, విద్యార్హత సర్టిఫికెట్లు, ఫొటోలు తీసుకొని ఈనెల 25 లోపు కలెక్టరేట్‌లోని మైనారిటీ సంక్షేమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కు ఎంపిక



తెయూ(డిచ్‌పల్లి): ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టార్గెట్ బాల్ టోర్నమెంట్ పోటీల్లో తెయూ బాలికల జట్టు పాల్గొంటుందని వర్సిటీ క్రీడావిభాగం డైరెక్టర్ సంపత్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారిణులు బుధవారం వీసీ రవీందర్‌ను కలిశారు. టీం జెర్సీని ఆవిష్కరించి, కిట్స్ పంపిణీ చేసిన వీసీ క్రీడాకారిణులను అభినందించారు. చెన్నై సవిత యూనివర్సిటీలో ఈ నెల 24 నుంచి 26వరకు జరిగే టోర్నమెంట్‌లో సత్తా చాటాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ సీహెచ్ ఆరతి, పీడీ బీఆర్ నేత పాల్గొన్నారు. తెయూ జట్టుకు మేనేజర్‌గా బి అరవింద్, కోచ్‌గా సౌమ్యను నియమించినట్లు డైరెక్టర్ సంపత్ తెలిపారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



ధర్పల్లి: హైదరాబాద్‌లో ఇటీవల కుక్కల దాడిలో మరణించిన ఇందల్వాయికి చెందిన బాలుడు ప్రదీప్ కుటుంబ సభ్యులను కాంగ్రెస్ నాయకులు బుధవారం పరామర్శించారు. బాలుడి తండ్రి గంగాధర్‌కు రూ.పది వేల ఆర్థిక సాయం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితోనే బాలుడు చనిపోయాడన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, నాయకులు తహెర్ బిన్ హందాన్, నగేష్‌రెడ్డి ముప్ప గంగారెడ్డి, శేఖర్ గౌడ్, నవీన్ గౌడ్, వెంకట్ రెడ్డి, సంతోష్‌రెడ్డి, రాజు ఉన్నారు.

గుట్టలు తొలిచి మొరం దందా

- అనుమతులు గోరంత.. తవ్వేది కొండంత
- ఆర్‌అండ్‌బీ అనుమతి పేరుతో వెంచర్లకు తరలింపు
- పట్టించుకోని అధికారులు



చిన్నాపూర్ శివారులో కొండను చీల్చడంతో ఏర్పడిన దారి



మాదాపూర్ గుట్టను తొలుస్తున్న జేసీబీ

మాక్లూర్: మొరం వ్యాపారులు రెచ్చిపోతున్నారు. గుట్టలను తొలిచి దందా చేస్తున్నారు. కొంత మేర తవ్వకాలకు అనుమతులు తీసుకొని గుట్టలు మాయం చేస్తున్నారు. మండలంలోని చిన్నాపూర్, రాంచంద్రాపల్లి శివారుతో పాటు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్, రెవెన్యూ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఈ దందా కొనసాగుతున్నా పట్టించునేవారు కరువయ్యారు. పచ్చని చెట్లను తొలగిస్తూ గుట్టలను తొలిచి మొరం తరలిస్తున్నారు. సంబంధిత అధికారులు కనీస చర్యలు చేపట్టడం లేదు అడిగిన వారికి ఆర్‌అండ్‌బీ అనుమతి ఉందని అధికారులు చెబుతున్నా.. మొరం వ్యాపారులు మాత్రం రోజువారిగా తరలిస్తున్న వందలాది టిప్పర్లలో ఒక్కటి, రెండు మాత్రమే ఆర్‌అండ్‌బీ పనులకు వెలుతుండగా మిగితావి ప్రైవేట్ వెంచర్లకు వెళ్తున్నాయనేది బహిరంగ రహస్యం ఇదంతా అధికారుల కనుసన్నల్లోనే జరుగుతుందనే ఆరోపణలు ఉన్నాయి. మండలంలోని సింగంపల్లి శివారులోని 51/2 సర్వేనంబర్‌లో 2.60 హెక్టార్లలో, దీని పక్కనే మరో ఎకరం 20 గుంటల భూమిలో మాత్రమే మొరం తవ్వకాలకు అధికారిక అనుమతి ఉన్నప్పటికి మిగితా అన్ని చోట్ల విచ్చల విడిగా మొరం దందా రాత్రి, పగలు తేడా లేకుండా సాగుతోంది. మొరం తరలింపు వాహనాల కోసం వ్యాపారులు చిన్నాపూర్ శివారులో గుట్టను సైతం తొలిచేశారు. మొరం రవాణా అనుమతులు ఉన్నవారు సైతం నిబంధనలను తుంగలో తొక్కి మొరం వ్యాపారం సాగిస్తున్నారంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి అక్రమ మొరం దందాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారుల అండదండలతోనే..



మొరం వ్యాపారులకు అధికారుల అండదండలు ఉన్నాయి. నిత్యం రెవెన్యూ, పోలీస్ కార్యాలయం ఎదుట నుంచే పదుల సంఖ్యలో మొరం టిప్పర్లు వెళ్తున్న పట్టించుకునే వారు ఉండరు. ఈ విషయమై ఫిర్యాదు చేస్తే ఆర్‌అండ్‌బీ పనులకు వెళ్తున్నాయని, కలెక్టర్ అనుమతి ఉందని చెబుతున్నారు. వారేమో వెంచర్లకు మొరం తలించి వ్యాపారం చేస్తున్నారు.

– పల్లపు వెంకటేష్, సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి

టిప్పర్లు సీజ్ చేస్తాం..



మండలంలో సింగంపల్లి శివారు నుంచి మొరం తరలించడానికి ఇద్దరికే అనుమతి ఉంది. మాదాపూర్ తదితర ప్రాంతాల్లో మొరం తీయటానికి అనుమతులు లేకున్నా ఆర్‌అండ్‌బీ పనులకు కలెక్టర్ ఇచ్చిన అనుమతి మేరకు తీసుకెళ్తున్నారు. వారికి వే బిల్లులు ఇచ్చి వీఆర్‌ఏలను పర్యవేక్షణకు పెడుతాం. వ్యాపారులు ఆ మొరాన్ని ఎక్కడికి తరలిస్తున్నారేనిది మాకు తెలియదు. అక్రమాలకు పాల్పడితే టిప్పర్లను సీజ్ చేస్తాం. – శంకర్, తహసీల్దార్, మాక్లూర్

అర్థం చేసుకుంటే గణితం ఎంతో సులువు



వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న వీసీ రవీందర్

తెయూ(డిచ్‌పల్లి): లెక్కలంటే (గణితం) తమలో నెలకొన్న భయాన్ని విద్యార్థులు ముందుగా తొలగించుకోవాలని తెలంగాణ యూనివర్సిటీ వీసీ డి రవీందర్ సూచించారు. బాగా అర్థం చేసుకుంటే లెక్కలు ఎంతో సులువన్నారు. తెయూ గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం కంప్యూటర్ సైన్స్ కాలేజీ సెమినార్ హాల్‌లో నిర్వహించిన ఒక రోజు వర్క్‌షాప్‌లో వీసీ మాట్లాడారు. ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ గణిత శాస్త్రంలో చేసిన కృషి, సేవలను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు జ్ఞానాన్ని సాధించాలన్నారు. నిజ జీవితంలో గణిత శాస్త్రం ప్రాముఖ్యతను కంట్రోలర్ ఎం అరుణ వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ ఆరతి, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ సంపత్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు ఎం చంద్రశేఖర్, పద్మ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జర్నలిస్ట్ గంగాధర్‌కు నివాళి



రుద్రూర్(కోటగిరి): కోటగిరి చెందిన సీనియర్ జర్నలిస్ట్ హంగర్గా గంగాధర్‌కు దళిత సంఘాల నాయకులు నివాళి అర్పించారు. బుధవారం దళిత ఐక్య కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో కోటగిరిలో ఆయన సంతాప సభ ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన ఇంటికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. తమకు అందించిన సహాయాన్ని గుర్తు చేసుకుంటూ కంట తడిపెట్టుకున్నారు. మీర్జాపూర్ సాయన్న, నాగేశం, రాములు, జీవన్, సాయిలు, సైదయ్య, శివ శంకర్, గంగారాం, అబ్బయ్య పాల్గొన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు



కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

రెంజల్: రెంజల్‌లో బాల్య వివాహానికి జరుగుతున్న ఏర్పాట్లను అధికారులు అడ్డుకున్నారు. గ్రామంలో 16 ఏళ్ల బాలికకు వివాహం నిశ్చయమైంది. గురువారం పెళ్లి జరగాల్సి ఉండగా అధికారులు బుధవారం ఇంటికి చేరుకుని వివాహాన్ని నిలిపివేయించారు. బాలిక కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

పిల్లల దత్తతను..

మండలంలోని దండిగుట్టలో చట్ట విరుద్ధంగా పిల్లలను దత్తత ఇస్తుండగా అధికారులు బుధవారం అడ్డుకున్నారు. ఐదు నెలల కవల పిల్లలను తల్లిదండ్రులు దూరపు బంధువులకు దత్తత ఇస్తున్నట్లు తెలుసుకున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీలారాణి గ్రామానికి చేరుకుని దత్తత చెల్లదని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

ఆరోగ్య ఉపకేంద్రం తనిఖీ



పెర్కిట్: ఆలూరు మండల కేంద్రంలోని ఆరోగ్య ఉపకేంద్రాన్ని బుధవారం జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి అశోక్ తనిఖీ చేశారు. చిన్నారులకు, గర్భిణులకు క్రమం తప్పకుండా టీకాలు ఇవ్వాలని సూచించారు. ఆరోగ్య పర్యవేక్షకులు సుభాష్, ఆరోగ్య కార్యకర్త గిరిజ, నరేష్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కారు అదుపు తప్పి ఒకరి మృతి

- మృతురాలు సూర్యాపేట జిల్లా వాసి



జయలక్ష్మి మృతదేహం



డ్రెయినేజీలోకి దూసుకెళ్లిన కారు

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) లోని చర్చి సమీపంలో బుధవారం తెల్లవారుఝామున కారు అదుపుతప్పి డ్రైనేజీలోకి దూసుకెళ్లిన ఘటనలో గుండ జయలక్ష్మి (38) అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. డిచ్‌పల్లి ఎస్సై గణేష్ తెలిపిన వివరాలు.. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం త్రిపురవరం గ్రామానికి చెందిన పుచుకుల గోపాలకృష్ణ, మేనత్త జయలక్ష్మి, బాబాయి ఆనందం సాంబశివరావుతో కలిసి మంగళవారం రాత్రి 10 గంటలకు సూర్యాపేట నుంచి నిజామాబాద్‌కు బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న కారు (నెంబరు టీఎస్ 29 కే 9121)ను సాంబశివరావు నడుపుతున్నాడు. బుధవారం తెల్లవారురుఝామున సుమారు 5 గంటలకు డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామం వద్ద సాంబశివరావు నిద్రమత్తులో ఉండటం వల్ల కారు అదుపు తప్పి రోడ్డుపక్కన గల డ్రైనేజీలోకి దూసుకెళ్లింది. కారు ముందు ఉన్న బెలూన్లు తెరుచుకోవడంతో ముందు ఉన్న సాంబశివరావు, గోపాలకృష్ణ స్వల్ప గాయాలతో బయట పడ్డారు. కారు వెనక సీటులో పడుకున్న జయలక్ష్మి ప్రమాదం జరిగిన వెంటనే షాక్ గురికావడంతో మృతి చెందింది. మార్కెటింగ్ ఉద్యోగం చేసే గోపాలకృష్ణ, కొద్ది కాలం క్రితం నిర్మల్ జిల్లా లోహెస్రా మండలం గడ్‌చాందాకు చెందిన యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. మూడు నెలల క్రితం ఆమె బిడ్డకు జన్మనిచ్చింది. తన భార్యాబిడ్డలను ఇంటికి తీసుకెళ్లేందుకు మేనత్త, బాబాయిలతో కలిసి గోపాలకృష్ణ వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. గోపాలకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై గణేష్ తెలిపారు.

యువకుడి అదృశ్యం



ఆకుల సతీష్

ఖలీల్‌వాడి:నగరంలోని ఎల్లమ్మగుట్టకి చెందిన ఆకుల సతీష్ కనిపించడం లేదని నాలుగో టౌన్ ఎస్సై సందీప్ తెలిపారు. ఈ నెల 11న ఇంటి నుంచి వెళ్లిన సతీష్ తిరిగి రాలేదు. దీంతో సందీప్ తల్లి లక్ష్మి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

గడ్కోల్‌కు చెందిన ఒకరు..



గొనపూడి శ్రీను

సిరికొండ: మండలంలోని గడ్కోల్ గ్రామానికి చెందిన గొనపూడి శ్రీను అదృశ్యమైనట్లు ఎస్సై నర్సింలు తెలిపారు. ఈ నెల 20న సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని శ్రీను అన్న రమణయ్య బుధవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఆ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తాండూర్‌కు చెందిన మహిళా..



బాలమణి

నర్సాపూర్: మెదక్ జిల్లా నర్సాపూర్ బస్టాండ్‌లో మహిళ అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. నాగిరెడ్డిపేట మండలం తాండూర్‌కు చెందిన బోరంచ బాలమణి ఈ నెల 15న నర్సాపూర్‌లో బస్టాండ్‌లో కనిపించకుండా పోయింది. ఈ ఘటనపై ఆమె కుటుంబ సభ్యులు మంగళవారం నర్సాపూర్ ఠాణాలో ఫిర్యాదు చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మోపాల్: మండలంలోని న్యాల్‌కల్ మాసాని చెరువులో గుర్తు తెలియని వ్యక్తి (35 నుంచి 40 ఏళ్లు) మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై మహేష్ బుధవారం తెలిపారు. మూడు, నాలుగు రోజుల క్రితం వ్యక్తి చెరువులో పడి మృతి చెంది ఉంటాడని చెప్పారు. గంగపుత్రులు బుధవారం ఉదయం చేపలు పట్టేందుకు వెళ్లగా మృతదేహం కన్పించింది. వారి సమాచారం మేరకు ఘటన స్థలాన్ని పరిశీలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నడుస్తున్న కారులో మంటలు



మంటలను ఆర్పుతున్న స్థానికులు

పిట్లం (జుక్కల్): పిట్లం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో బుధవారం నడుస్తున్న కారులో మంటలు చెలరేగాయి. అక్కడే ఉన్న స్థానికులు కారు నడుపుతున్న వ్యక్తిని అప్రమత్తం చెయ్యడంతో ప్రాణాపాయం తప్పింది. గాంధారికి చెందిన ప్రశాంత్ విస్టా కారులో నిజాంసాగర్ రోడ్ వైపు నుంచి వస్తుండగా కారు నుంచి పొగలు రావడంతో స్థానికులు గమనించి అప్రమత్తం చేశారు. కారును పక్కకు ఆపి పరిశీలిస్తుండగా కారులో మంటలు చెలరేగాయి. స్థానికులు మంటలను ఆర్పి వేశారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

కామారెడ్డి క్రైం: డ్రంకన్ డ్రైవ్ కేసులో కామారెడ్డి కోర్టు ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష విధించింది. దేవునిపల్లి పోలీసులు ఈనెల 21న వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా పట్టణానికి చెందిన షాదుల్లా, అబ్దుల్ రహీం డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డారు. బుధవారం కోర్టులో హాజరుపర్చగా ద్వితీయశ్రేణి న్యాయమూర్తి ప్రతాప్ వారికి రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

మెజీషియన్ 'రారాజు'

- ఇంద్రజాల ప్రదర్శనలతో ఆకట్టుకుంటున్న రాజు
- నేడు మెజీషియన్ డే



ట్యూబ్‌లైట్ నములుతూ ప్రదర్శన చేస్తున్న రాజు



రాజును అభినందిస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

నందిపేట్: రెప్పపాటు కాలంలో ఆవిష్కరించే అద్భుతం మ్యాజిక్.. ఉన్నది లేనట్లుగా.. లేనిది ఉన్నట్లుగా కనికట్టు చేస్తూ ఇంద్రజాలికులు తమ ప్రదర్శనతో ఆకట్టుకుంటారు. తన మ్యాజిక్‌తో వీక్షకులను కట్టిపడేస్తాడు నందిపేటకు చెందిన ఇంద్రజాలికుడు వాల్గోట్ రాజు. నేటి కంప్యూటర్ కాలంలో అనేక చోట్ల చోటుచేసుకున్న మూఢ నమ్మకాలను పారదోలేందుకు తన ప్రదర్శనల ద్వారా ప్రయత్నం చేస్తున్నాడు. ప్రపంచ ప్రఖ్యాత ఇంద్రజాలికుడు పద్మశ్రీ పీసీ సర్కార్ (సీనియర్) జయంతి ఫిబ్రవరి 23న ఏటా ప్రపంచ ఇంద్రజాల దినోత్సవం నిర్వహిస్తున్నారు.

వాల్గోట్ రాజు చిత్ర విచిత్ర ప్రదర్శనలు చేస్తు పలువురి మన్ననలు పొందుతున్నాడు. కళ్లకు గంతలు కట్టుకుని మోటార్ సైకిల్ నడపడం, ట్యూబ్ లైట్లు, బల్బులు, తినడం, శూన్యంలో నుంచి పావురాలు, గొడుగులు తీయడం, న్యూస్ పేపరును ముక్కలు ముక్కలు చేసి అతికించడం, పేపరును కాల్చి డబ్బును తీయడం ప్రదర్శనలతో పటు క్లోజప్ ట్రిక్స్ ప్రదర్శిస్తుంటాడు. పదిహేను ఏళ్లుగా వివిధ ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇస్తూ, పలువురి మన్ననలు పొందాడు. అంతర్జాతీయ వండర్ బుక్ ఆఫ్ రికార్డు, జూనియర్ బుక్ ఆఫ్ రికార్డు, గోల్డెన్ స్టార్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు సాధించాడు. తెలంగాణ రత్న బిరుదును కైవసం చేసుకున్నాడు.

మూఢనమ్మకాలను పాగొట్టడమే లక్ష్యం

ఈ కళ ద్వారా సమాజంలోని మూఢ నమ్మకాలను తొలగించేందుకు నా వంతు ప్రయత్నం చేస్తున్నా. మ్యాజిక్ చేసి ప్రజలను ఆశ్చర్యానికి లోను చేయడం ఆనందానిస్తుంది. భవిష్యత్‌లో మరిన్ని ప్రదర్శనలు ఇచ్చి ప్రజలను ఆకట్టుకునే యత్నం చేస్తా.

– వాల్గోట్ రాజు, మెజీషియన్

శ్రీనగర్‌లో పారిశుధ్యం భేష్

- పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ వెస్లీ



వైకుంఠధామాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర పంచాయతీ శాఖ డిప్యూటీ కమిషనర్ పీజే వెస్లీ

నిజామాబాద్ సిటీ:నిజామాబాద్ రూరల్ మండలం శ్రీనగర్‌లో పారిశుధ్య నిర్వహణ బాగుందని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ పీజే వెస్లీ అన్నారు. బుధవారం ఆయన గ్రామాన్ని సందర్శించారు. గ్రామం క్లిన్ అండ్ గ్రీన్ విభాగంలో అవార్డు పొందడానికి అర్హత సాధించిన నేపథ్యంలో గ్రామంలో జరుగుతున్న పనులను పరిశీలించేందుకు వచ్చారు. గ్రామంలో నర్సరీ, అవెన్యూ ప్లాంటేషన్, పల్లె ప్రకృతి వనం, వర్మి కంపోస్టు షెడ్డు, శ్మశాన వాటికను పరిశీలించారు. గ్రామంలో క్లిన్ అండ్ గ్రీన్ పనులు పక్కగా అమలు అవుతుండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. వర్మి కంపోస్టు షెడ్డులో తడి పొడి చెత్త వేరుగా చేసే విధానం బాగుందని గ్రామ సర్పంచ్ ఉమ్మెడ సురేందర్, పారిశుధ్య సిబ్బందిని అభినందించారు. డీపీవో జయసుధ, డీఎల్‌పీవో నాగరాజు, ఎంపీడీవో మల్లేష్, ఎంపీవో మధురిమ, కార్యదర్శి సందీప్ పాల్గొన్నారు.

పేదల కోసం ఫార్మసీ అభినందనీయం



ఫార్మసీని ప్రారంభిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి

నిజామాబాద్‌నాగారం: పేదల కోసం మల్లు స్వరాజ్యం ట్రస్ట్ ఆధ్వర్యంలో సరోజినమ్మ ఫార్మసిని ఏర్పాటు చేయడం అభినందనీయమని సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి అన్నారు. నాందేడ్‌వాడలోని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ అసోసియేషన్, మల్లు స్వరాజ్యం మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జనరిక్ ఫార్మసీని బుధవారం ఆమె ప్రారంభించారు. ప్రజల కోసం నిస్వార్థంగా సేవలు చేస్తున్న మల్లు స్వరాజ్యం మెమోరియల్ ట్రస్ట్‌ను అభినందించారు. ఒక రిటైర్డ్ టీచర్ తన యావదాస్తిని సేవా కార్యక్రమాల కోసం సంఘానికి ఇవ్వటం అనేది ఆమె దాతృత్వానికి నిదర్శమన్నారు. డిప్యూటీ డైరెక్టర్ ట్రెజరీ కోటేశ్వరరావు మాట్లాడుతూ డబ్బు కన్నా దాతృత్వం గొప్పదన్నారు. సరోజినమ్మ చేస్తున్న సేవ వెలకట్టలేనిదన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి వినయ్‌కుమార్, ట్రస్ట్ అధ్యక్ష కార్యదర్శులు దత్తాత్రేయరావు, రామ్మోహన్‌రావు, ఈవీల్ నారాయణ, ప్రసాద్ రావు, మదన్మోహన్, భోజరావ్, అందే సాయిలు, సిర్ప లింగయ్య, నూర్జహాన్, సబ్బని లత, నర్రా రామారావు పాల్గొన్నారు.

నిధులను సద్వినియోగం చేసుకోవాలి



హెచ్‌ఎంతో మాట్లాడుతున్న డీఈవో

ఎడపల్లి: ప్రభుత్వ పాఠశాలలకు వచ్చిన నిధులను అభివృద్ధి పనులకు వినియోగించాలని డీఈవో దుర్గాప్రసాద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా వచ్చిన అదనపు గదుల నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరంలో పాఠశాల అభివృద్ధి గ్రాంటులను ఖర్చు చేసి నిధులు మురిగిపోకుండా చూడాలన్నారు. ఇప్పటి వరకు ఈ నిధులను ఖర్చు చేయకపోవడంపై హెచ్‌ఎం సాయిలు తీరుపై అసహనం వ్యక్తం చేశారు. నిధులను ఖర్చు చేయకపోవడం, చిన్న చిన్న పనులను పూర్తి చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జెడ్పీ ఉపాధ్యక్షురాలు రజిత యాదవ్, ఎంపీడీవో గోపాలకృష్ణ, ఎంఈవో కొడాలి రామారావు ఎంపీటీసీ బాబా ఉన్నారు.

చెరువు కబ్జా చేస్తున్నారని ఫిర్యాదు



మ్యాప్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

డిచ్‌పల్లి: మండలంలోని నడిపల్లి తండా శివారు నాగ్‌పూర్ గేట్ సమీపంలోని ఎక్కుంట చెరువును కబ్జా చేస్తున్నారని తండా వాసులు బుధవారం తహసీల్దార్ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. చెరువులో పట్టా భూమి పేరుతో మొరం వేసి చదును చేస్తున్నారని ఆరోపించారు. స్థానికుల ఫిర్యాదుపై స్పందించిన తహసీల్దార్ వెంటనే రెవెన్యూ సిబ్బందితో కలిసి చెరువు వద్దకు చేరుకున్నారు. ఎక్కుంట చెరువు విస్తీర్ణం 16 ఎకరాలు ఉండగా చెరువును కబ్జా చేస్తున్నారని తండా యువకులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో ఇలాగే మొరం పనులు వేస్తుంటే తాము అడ్డుకున్నామని, మళ్లీ ఇప్పుడు మొరం వేసి చదును చేస్తున్నారని వివరించారు. వెంటనే సర్వేయర్ మోహన్‌ను పిలిపించిన తహసీల్దార్ చెరువు మ్యాప్‌ను పరిశీలించారు. చెరువుల వద్ద పట్టా భూములున్న వారు ఏమైనా పనులు చేపట్టాలంటే ముందుగా రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ స్పష్టం చేశారు. సర్వే చేసి హద్దులు నిర్ణయించే వరకు మొరం పనులను నిలిపివేయాలని తహసీల్దార్ ఆదేశించారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య



మల్లేష్ (ఫైల్)

డిచ్‌పల్లి: మండలంలోని దేవ్‌నగర్ క్యాంప్ గ్రామానికి చెందిన సంపత్ మల్లేష్ (35) ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై గణేష్ బుధవారం తెలిపారు. వివరాలు.. కూలీ పనులు చేసుకుని జీవించే మల్లేష్‌కు ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ అయ్యాయి. మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి విషం తాగి రోడ్డు పక్కన పడిపోయాడు. గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే బాధితుడిని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అర్ధ రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య నందిని, ఒక కొడుకు, ఒక కూతురు ఉన్నారు. మల్లేష్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడు..



నవీన్‌కుమార్(ఫైల్)

ఎల్లారెడ్డి: కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎల్లారెడ్డి మండల కేంద్రంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఏఎస్సై నర్సింగ్‌రావు తెలిపిన వివరాలు.. పట్టణానికి చెందిన గడ్డం నవీన్‌కుమార్ (25) కుటుంబ కలహాలతో కొన్ని నెలల క్రితం పుట్టింటికి వెళ్లింది. ఎన్నిసార్లు పిలిచినా ఆమె కాపురానికి రాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది సాయిబాబా ఆలయం వెనకాల గల చెట్టుకు ఉరివేసుకున్నాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు.